# మోక్షం

నరకం ఎలా వుంటుంది?

చీకటి చీకటిగా....

రావుగారి తలంతా వర్షాకాలంలో కటిక చీకట్లో చిట్టడవిలా ఉంది.

పైన భగ్గున మండే సూర్యుడు.

బైట ఫెళ్ళున కాసే ఎండ.

ఎండ ఎలా వుంది?

పులికోరలా, పాము పడగలా.

నరకం ఎలా ఉంటుంది?

పులితో పాముతో చీకటిగా....

కచేరిలో అంతా చీకటిగా ఉంది. ఎదురుగా బల్లమీద నల్లని చీకటి గుడ్డ, సిరాపడితే విషంలో విషంలా కలిసిపోతుంది. ప్లీడర్ల నల్లకోట్ల నిండా వికృతంగా క్రూరంగా చీకటి. పోలీసువారి ఎర్రటోపీలనిండా చారలు చారలుగా చీకటి. చుట్టూ పడున్న ఖాళీసారా కుండలనిండా చల్లారిన చీకటి. ముద్దాయిల కళ్ళనిండా దీనంగా అజ్ఞానపు చీకటి.

బంట్రోతు వెళ్ళి పదకొండు గంటలూ కొట్టగానే రావుగారు కచేరిలో 'బెంచి' మీద కూర్చున్నారు.

ఇరవయేళ్ళయి ఇలా కచేరిలో అడుగు పెట్టడం, ఠంగున పదకొండు మోగడం.

ఎన్నాళ్ళకో మోక్షం?

ఈ వూరొచ్చి ఇలా గంటలు వింటూ అప్పుడే ఏడాదయింది.

నిన్న లెక్కలుకూడి రిపోర్టు పంపిన ప్రకారం ఈ యేడాదిలోనూ ఆరువేల సారా కేసులు!

సారా కేసులు! ఆరు వేలు!

మూడు వేలమంది జరిమానాలు కట్టుకున్నారు. దాదాపు మూడువేల మంది

జెయిలుకి పోయేరు. యాభై మంది కాబోలు యిళ్ళకి శుభంగా పోగలిగేరు.

ఒక్క ఏడాదిలో తన చేతిమీదుగా యింతమంది?

మొత్తం ఇరవయ్యేళ్ళలోనూ ఈ విధంగా ఎంత మంది?

లెక్కకట్టలేక, ఊహించుకోలేక, అంతుదొరక్క రాత్రంతా నిద్రపట్టలేదు.

తలనొప్పిగా ఉంది.

జ్వరం తగిలిందా?

అలానే వుంది. వళ్ళంతా మండుతోంది.

బైట ఎండలా పాముపగలా.

రాత్రల్లా దయ్యాల ముఖాలే కనిపించాయి.

వాళ్ళంతా అన్ని వేలమందీ ఇప్పుడెక్కడ చెప్మా? ఎక్కడ?

కటకటాల వెనక కుళ్ళి కుళ్ళుంటారు. అక్కడే అందులోనే చచ్చుంటారు. బైటకొస్తే-

పగబట్టి వుంటారు.

నామీద కొన్నివేల పగలు. లోకంలో కోటాను కోట్ల పగలు.

పాముల్లా వాటి పడగల్లా 'ఏమిటి?!! ఏమిటవి?!!'

"కొత్త కేసుల్లో సారాట్యూబులు సార్" అన్నాడు బెంచి గుమాస్తా

"అంతేనా?"

రోజూ ఇలాగే పాముల్లా సారా ట్యూబులు.

మోటార్లవి, సైకిళ్ళవి, ఎర్రవి, నల్లవి.

అన్నిట్లోను సారా! కోర్టుకొస్తే సారా, కోర్టులో వున్నంత సేపూ సారా. రోజూ దాదాపు ప్రతి కేసూ సారా.

కూలీలు జెయిలుకి, కుష్టురోగులు జెయిలుకి, అమాయకులు జెయిలుకి, దరిద్రులు జెయిలుకి, ఆడవాళ్ళు, అనాథులు అంతా జెయిలుకి-

మరెక్కడికి? అంతా జెయిలుకే.

రావుగారి మెదళ్ళో చలి.

కీకారణ్యంలో చీకటి చినుకుల్లో అల్లుకొన్నట్టుగా మెదళ్ళో చలి అల్లుకొంటోంది.

"ఎవరది?"

"ఏమిటి సార్??" అని అడిగేడు బెంచిగుమాస్తా.

ఓహో కోర్టు కదూ!

మర్చేపోయాను.

ఎదురుగా నిల్చున్న ఆడమనిషి 'ముద్దాయివేనా?'

"అవును బాబూ!"

బెంచి గుమాస్తా కాయితం కట్టొకటి చేతి కందించాడు.

ఎదర నిల్చున్న ముద్దాయి ముప్పయేళ్ళది. చింపిరిజుట్టుది. పాలిపోయిన ఎఱ్ఱనిది. ఆమె కాళ్ళనిండా బురద బురద, వంటినిండా బుగ్గి బుగ్గి, కోకనిండా డాగులుడాగులు, తలనిండా పేలు పేలు, కళ్ళనిండా జడుపు జడుపు, గుండెల్లో భయం భయం, చేసిన నేరం సారా సారా.....

"ఏం అమ్మా! నీ దగ్గిర సారా పట్టుకున్నారా?"

మామూలుగానే మాట్లాడుతున్నాను, మరేం భయం లేదు; రాత్రల్లాపిచ్చెక్కినట్టుగా ఉంది. మరేం భయం లేదు.

"మాట్లాడవేం; సారా పట్టుకున్నారా?"

ఆడదాన్ని, సరిగా, రోజూలాగే కసిరాను. మరేం ఫరవాలేదు.

"పట్టుకున్నారా??"

"పట్టుకున్నారు బాబూ."

"నేరం చేశావా?"

"నేరం చేశావా అంటే ఏటిసెప్పేది బాబూ! అర్ధరూపాయి కూల్డబ్బులిచ్చి మొయ్యమన్నారు బాబూ!"

"అదే నేరం చేశావా?"

"ఏ ఎెరగనట్టు సావుకారుబాబూ ఒల్లకున్నాడు, బాబూ."

"షావుకారు సంగతి కాదు; నువ్వు నేరం చేసేవా? లేదా?"

"సేసేను బాబూ,"

"డబ్బు కట్టుకోగలవా?"

"ఎంత బాబూ?"

"వంద."

"వొంద రూపాయలేవుంటే, అర్ధరూపాయి కూల్డబ్బులికి అమ్ముడు పోతానా బాబూ?"

"అయితే ఆరు వారాలు."

జెయిలు జెయిలు!!

మామూలు ధోరణిలో పడుతున్నాను. మరేం భయంలేదు. కొంచెం తలనొప్పిగా ఉంది....రాత్రల్లా దెయ్యాలు...

ఎవరో కెవ్వున...

ఏమిటది?

ఏడుపా? ఎవరిది?

"నా కొడుకు బాబూ!....ఒల్లకోరా నాయనా."

ముద్దాయి వెనకనుంచి ఆమెకాళ్ళు పట్టుకొని మూడేళ్ళపిల్లడు భావిపోరుడు, భగవంతుడెలా పుట్టించాడో అలా ఉన్నవాడు. భయంతో ఏడుస్తున్నాడు.

"ఎందు కేడుస్తున్నాడు?"

"నిన్న ఇయాల్టేళకి తిన్నకూడు! మరేడడా బాబూ?"

ఆకలి... ఏడుస్తున్నాడు!

"పిల్లడి కెవరూ లేరా?"

తండ్రి? తోబుట్టువులు? తాతలు? తండ్రి తోబుట్టువులు? నీ వాళ్ళు? చుట్టాలు, నేస్తాలు? ఎవరూ? ఎవరూ లేరా? ఇంత ఊరుంది. ఇంత దేశం ఉంది. ఇంత జనాభా వుంది! ఇంత మందిలో ఎవరూ లేరా!!

"అడవిలో వున్నట్టున్నాం బాబూ!"

అడవిలో అతి చీకటి!

అక్కడ పులులూ, పాములూ!

అక్కడ సూదుల్లా చీకటి చినుకులు.

"మరైతే పిల్లణ్ణేం చెయ్యడం! ఓయ్, ఎవరక్కడ! మీ స్టేషన్ కేసేనా! జెయిలు వారంటు రాయించినప్పుడు 'పిల్లడితో తల్లి' అని గుమాస్తా చేత రాయించు. మర్చిపోకు; రాయకపోతే జెయిల్లో తీసుకోరు, బైటుంటే కుఱ్ఱాడు చస్తాడు."

"చిత్తం."

"వీళ్ళని తీసుకుపో"

"చిత్తం చిత్తం"

ఏడుపు దూరమయింది.

బైటుంటే చస్తారు. జెయిల్లోనే బతకాలి.

రావుగారి మెదడంతా చీకటిగదిలా ఉంది.

చీకటిగదిలో చీమల ఏడుపు.

వాటి గురించి తేళ్ళు జెర్రులు.

నరకం ఎలా వుంటుంది?

తేళ్ళతో, జెర్రులతో అతి చీకటిగా....

అక్కడ ఏముంటాయి?

పగబట్టిన చలి చీమలు!!!

....చేతజిక్కి....

నా చేతులు నల్లతాచులు

నా చేతుల మూతుల్లో అయిదేసి నాలికలు, అన్నేసి కోరలు.

ఈ సిరాలో విషం.

నా కాలంలో కాటు!

"తరవాత కేసు, వేగిరం పిలువు. అడ్మిషన్ కేసులన్నీ ముందరానీ!

అయిదు గంటల్దాటితే జెయిల్లోకి తీసుకోరు?

జెయిలుకి పగలు వెళ్ళాలి - పిల్లల్తోసహా!

అడివికంటే జెయిలే మెరుగు.

"ఈ కేసేమిటి?"

"తాగుడు".

"తాగేవా?"

"తాగేను సార్."

"డబ్బు కట్టుకుంటావా?"

"నూకాలమ్మ జాతరకి తాగేనుసార్."

"డబ్బుకట్టుకుంటావా??"

"పండుక్కూడా తాగ్గూడదా సార్?"

"డబ్బుకట్టుకుంటావా లేదురా రాస్కెల్!"

"జోబీల ఖాళీసార్."

"నాలుగు వారాలు."

జెయిలు జెయిలు!!

"తరవాత కేసు వేగిరం పిలువు. ఎవడువాడు?"

పద్దెనిమి దేళ్ళవాడు. పడుచుతనం లేనివాడు. లోతుకుపోయిన కళ్ళు, చొచ్చుకుపోయిన దవడలు, మాడిన ముఖం ఎండిన గుండెలు.

"ఏం కేసు?"

"చోరి"

"కాయితాలిచ్చేరా?"

"ఇచ్చేరండి."

"నిన్న సంబరంలో జేబు కొట్టేవుట-నిజమేనా"

"నిజమేనండి."

"చోరీ నేరం చేసేవా?"

"చేసేనండి."

"నిన్నెప్పుడో చూసినట్టుంది. ఇదివరకో సారి వచ్చేవు కదూ?"

"సారా కేసులో మీరే రెణ్ణెల్లు జైలేసేరు"

"బైటకొచ్చి ఈ పనెందుకు చేసేవు? సారానే అమ్ముకో లేకపోయావా?"

"మదు పెవడెడ తాడండి? మదుపు లేని బిజినేసేటంటే జోబీలు కొట్టడ మేనన్నారండంతాను."

"ఎవరన్నారు?"

"జెయిల్లో అందరూ,"

"చోరీ చెయ్యకూడదు. తప్పు"

"సారాకి జెయిలే! చోరీకి జైయిలే! ఏద్దైతేనేటండి?"

"ప్రథమ తప్పుకిద వదుల్తాను. జామీను కెవరైనా వున్నారా?"

"లేరండి"

"ఈ సారొచ్చేవంటే ఆర్నెల్లు! నీ మంచికి చెప్తున్నాను ఈ సారికి నెల పో!"

నేరాలకి తేడాలేదు. దేనికైనా జెయిలే.

"తరవాత కేసు పిలువు. తరవాత్తరవాత."

మామూలుగానే వున్నాను. మరేం భయంలేదు. మనసు సర్దుకొంటుంది. అనవసరంగా గాభరా పడ్డాను.

ఈ ముసలమ్మెవరు? పాత ముసలమ్మే.

"ముసలమ్మా! కోర్టులో కనిపించొద్దని నీ కెన్నిసార్లు చెప్పేను!"

"జరుగుబాటెలా బాబూ మరీ?"

"ఈసారీ సారా వేనా?"

"ఈ పాలి అబద్దం కేసు బాబూ."

"సారా కేసేనా?"

"సారా. తప్పితే కల్లు. అయినాక నాకింకేటుంటుంది బాబూ! అన్ని సుట్లొచ్చేసు. ప్రొయిబిసన్ కేసల్ల తప్ప మరెందలైనా ఒచ్చేనా? ఈ సుట్టు కూడా సారాయే కాని బాబూ ఒట్టబొద్దం కేసు బాబూ!"

"వాదించుకుంటావా?"

"నా నెప్పుడైనా ఓడించానా? కడితే జలిమానా కాకపోతే జెయిలు. నా నెప్పుడు వోదించను బాబూ! కేసు కొప్పేసుకుంటాను బాబూ."

"సారా దొరికిందా?"

"దొరికింది."

"నేరం చేసేవా?"

"ఏఏ! సేసేనని సెప్తున్నాగదా!!"

"డబ్బు కడతావా? ఫైమిస్తాను."

"మూణ్ణెల్లు."

జెయిలు జెయిలు!

"అదే పదేలు బాబూ!....కాని సూడు బాబూ! ఒణ్ణం రాయించు బాబూ! ముసిల్దాన్ని. ఆ జొన్నకూడు తిన్లేను. సచ్చిపోవాలన్నమాట. ముసిల్దాన్ని సంపేక ఒణ్ణం రాయించు బాబూ! వచ్చే జన్మల నీ కడుపున పుడతాను. ముసిలి ముండ కూతుర్ని."

"పోపో బైటకి పో"

"బాబ్బాబు! ఒణ్ణం!"

"చూస్తాను. బైటకెళ్ళు. ఓయ్ తీసుకుపొండి."

వీళ్ళందరికి తమాషాగా వుంది! పుట్టింటికెళ్ళినట్టు వెళుతుంది ముండ! వీళ్ళని స్పేర్ చెయ్యకూడదు! అబద్ధం కేసట. వప్పేసుకొంటుందిట. అబద్ధం కేసులో జెయిలేసి నందుకు ఆ పాపం నాకు అంటుకోవాలని దొంగముండ దురుద్దేశం. రాస్కెల్స్. అంతా రాస్కెల్స్! అనవసరంగా వీళ్ళని చూసి కనికరిస్తున్నాను. వెధవల్ని పాతేయాలి, పాతేస్తే చస్తారు. కాటేస్తే చస్తారు, పగపడతారు రాస్కెల్సు!

తరవాత వాళ్ళని రమ్మను. ఆ కేసు! మరోటి! మరోటి! మరొకరు-పన్నెండేళ్ళ పిల్ల; 'యాభై కట్టు!' 'నీబాబొచ్చాడా? ఇలా రమ్మను' 'జైమివ్వను' 'కట్టకపోతే స్కూలుకి పంపించేస్తాను. రెండేళ్ళుంటుంది చూసుకో మరి, వేగిరంకట్టీ' ఇరవయ్యేళ్ళ పడుచు, 'అరవై జరిమానా! వేగిరం కట్టు. కట్టకపోతే ఆర్నెల్లు. కట్టేస్తావుకద! కట్టకపోతే తెలీదా?' కాటేస్తాను. వేళ్ళు పోయిన ముసలాడు. 'నీ రోగం చూసి జాలిపడను. రెండు వందలు కడితే కట్టు. లేకపోతే జైలుకిపో. నీ షావుకారేడీ, రమ్మనిలా రమ్మను. వేగిరం కట్టీ. కట్టవా? నాలుగునెల్లుండయితే! అన్నం రాయను పో!'

మరొక పడుచువాడు.

"నాలుగు గేలన్ల సారా దొరికిందా?"

"దొరికింది."

"అయిదు నెల్లు."

జెయిలు జెయిలు!!

"జెరిమానా కడతాను బాబో!"

"వీల్లేదు."

"మొన్న అప్పారావుకి పది గేలన్లకి రెండొందలేసేవు బాబూ!"

"నోర్మయ్యరా. రాస్కెల్!"

"డబ్బు తెచ్చాడుబాబూ, షావుకారు."

"వీల్లేదు."

"రెడీగుంది బాబూ."

"వీల్లేదు."

"బాబూ బాబూ."

"అయిదు నెల్లుండు."

"బాబో బాబో!"

"రాసేసేను"

"బాబో బాబో! జెయిలొద్దు బాబో! జెరిమానా కడతాను బాబో! జెయిల్లో చంపేస్తారు బాబో! నన్ను చంపేస్తారు బాబో! జరిమానా కడతాను బాబో!"

చంపేసినా సరే.

"వీల్లేదు."

"బాబో బాబో! నా కేసుకాదు బాబో, షావుకారుకి బదలా నా నొప్పుకున్నాను

బాబో! ఆడి కేసు బాబో! డబ్బుతెచ్చాడు బాబో! పోలీసోళ్ళ నడగండి బాబో! ఆడికేసు బాబో నా నొప్పుకోను బాబో! జెరిమానా ఎయిస్తాం అన్నాడు బాబో! జెయిలెయ్యకు బాబో! నా సారాకాదు బాబో! జవాను బాబును అడగండి బాబో! జెయిలెయ్యకు బాబో!"

"వీల్లేదు పో!"

"బాబో! బాబో! నా నొప్పుకోను బాబో! ఏస్తే జెరిమానా ఎయించుబాబో."

"లేదు వీల్లేదు!"

"బాబో! బాబో! సచ్చిపోతాను బాబో! పోలీసోళ్ళనకాల తిరిగేను బాబో! ఆళ్ళకి ఇన్‌ఫర్‌మేషన్లిచ్చేను బాబో! కేడిగాళ్ళందరికీగుఱ్ఱు, నామీద గుఱ్ఱు బాబో! బాబో బాబో! జెయిల్లో కేడిగోళ్ళు నన్ను బతకనివ్వరు బాబో! ఎఁవ్కలిరిసేస్తారు. ఆశిద్దం తినిపిస్తారుబాబో! పేనాలు తీసేస్తారు బాబో! వోర్డర్లు నిల్చొని సూస్తారు బాబో! కలగజేసుకోరు బాబో! జెయిలొద్దు బాబో! సంపేస్తారు బాబూ! బాబో! బాబ్బాబు! బాబ్బాబు!"

"వీణ్ని తీసుకుపోండి."

హాల్లో గలాటా. కిటికీలదగ్గర జనం, అల్లరి, కేకలు. పెద్దగా ఏడుపు. ఆఖరికి చల్లారింది.

పగలు పగలు రాక్షసప్పగలు!

వార్డర్లు కలగజేసుకోరు. కోణ్ణి కోసుకుని తినేసినట్టు వీణ్ని కేడీగాళ్ళు తినేస్తారు.

రాక్షసులు వీణ్ని నంజూకు తినేస్తారు. నమిలిమింగేస్తారు. కటకట కొరికేస్తారు.

నే వెళ్తే నన్నూ....

"వేగిరం! తరవాత కేసు."

నే వెళితే నన్నూ....

"క్విక్ క్విక్"

నే వెళితే నన్నూ....

ఛ! నే వెళ్ళను.

వెళ్ళకపోయినాపగబడతారు. రాస్కెల్స్! పైకి రానివ్వను. చీకట్లో చావమంటాను. బతికినంతకాలం జైల్లో చావమంటాను.

"తరవాత్తరవాత! తరవాత్తరవాత"

నే నక్కడికి వెళ్ళను, నే నేం తప్పుచెయ్యలేదు, పాపం చెయ్యలేదు. పాపాలన్నీ ఈ వెధవలే చేస్తున్నారు. ఆ పాప పట్టపగలు సారా మోసింది. వాడు పండుక్కి అదే పనిగా

తెగ తాగేడు. వాళ్ళు వెళ్ళాలక్కడికి. నే నెందుకు వెళ్ళాలి? పాపాలు చేసినవాళ్ళు-పబ్లిక్‌గా చేస్తున్నారు. షావుకార్లు సారా అమ్మి అమ్మి ఊరుకి మొగుళ్ళవుతున్నారు. పోలీసులు మామూళ్ళు దండుకొని వాళ్ళ గులాములుగా, కూలీలకి యములాళ్లవుతున్నారు. పత్తిలోంచి నూలుతీసినట్టు ప్లీడర్లు సారాలోంచి ఫీజులు వడుకుతూ దుక్కబలుస్తున్నారు. గుమాస్తాలంతా తినమరిగి పోతరిస్తున్నారు?

అయితే?

మేం జెయిలుకి వెళ్ళం.

జెయిళ్లన్నీ అభాగ్యులకి, దౌర్భాగ్యులకి, దరిద్రులకి.

"తర్వాత కేసేమిటోయ్? వేగిరం పిలవ్వేరా?"

"పిల్చేను సార్! ముద్దాయీ అడుగో!"

"ఏడీ?"

"అడుగో!"

ఎవడో మొండి వాళ్ళా ఉన్నాడు.

పెంకెగా నిల్చున్నాడు. పొగరుగా చూస్తున్నాడు. ముసలితనపు దొంగచూపుని పొగరుతో కలిపి చూస్తున్నాడు.

"వీడిమీదా సారాకేసేనా?"

"వీడిమీద పులుపు కేస్సార్!"

"సరే! ఏదిరా! కాయితా లిచ్చేరా!"

"ఇయిగో"

"నీ దగ్గిర పులుపు దొరికిందా?"

"పులుపు దొరికిందా అంటే ఏంటండీ! సరీగ్గ సెప్పండి. పులుపులంటే నిమ్మకాయ పులపా? సింతపండు పులుపా? ఏటండి. సరీగ జెప్పండి."

"ఓహోహోహో! పద్ధతి కావాలా నీకు?"

"పద్దతో ఏటో సరిసెప్పండి. యింటాను."

"అయితే విను! నీదగ్గిర నిషాపదార్థం తయారు చెయ్యడానికి పనికి వచ్చే సామాన్లు-అంటే కొంచెం అమోనియాపిండి, కొంచెం బెల్లం, కొంచెం పులిసిన బెల్లపు వూటా దొరికేయట. అందుచేత నిన్ను మద్రాసు ప్రొహిబిషన్ ఆక్టు 4(1) జి సెక్షన్ ప్రకారం ఎందుకు శిక్షించకూడదు? ఏమైనా చెప్పుకుంటావా?"

"ఏటది? మల్లా చెప్పండి. నాకేటి బోదపడ్డంలేదు."

వీడికి తల తిరుగుతోంది. సందేహం లేదు.

"మళ్ళీ జెప్తున్నాను. సరిగా విను."

"ఇంటాన్ను."

"నీ దగ్గర నిషా పదార్థం తయారుచెయ్యడానికి పనికివచ్చే సామాన్లు-అంటే... అంతా చదివేనుకదా! బోధపడిందా?"

"ఏమైనా చెప్పుకుంటావా?"

"చెప్పుకుంటానండి."

"చెప్పు."

"కల్లుంది తెలుసుకదండీ?"

"తెలుసు."

"కల్లుల నిషాపదార్థం ఉందా? నేదా? ఉందికదండి. అలాగుండండీ. తొల్త మీరేటన్నారండి?"

"నిషా పదార్థం తయారు చెయ్యడానికి పనికివచ్చే సామాన్లు."

"దగ్గరుంటే నేరవేఁకదండీ? అలా ఆగండీ. పుల్లకల్లు నిషా పదార్థం కదండి! యేం? పుల్లకల్లు సెయ్యాలంటే-ఆగండాగండి- పుల్లకల్లుకి ముందు తీపికల్లు తియ్యాలగదండి! ఉండండుండండి! అలా ఆగండి. నాను మీలా సదువుకోనేదు? కోటూ సొక్కా ఏసుకోనేదు. మరందుసేత, అలా ఆగండి. మరింక యినండి. పుల్లకల్లు సెయ్యాలంటే- అంటే నిసా పదార్థం తయారీ సెయ్యడానికి పనికొచ్చే తీపికల్లు ఎందల వుందండి? తాటిసెట్లల్ల వుంది. ఈతసెట్లంటుంటుంది. అందల ఉందండి? మరాకాడికైతే తాటి సెట్లకి జెయిలు సెప్పాల. ఈతసెట్లకి 'పైను!! పైనెయ్యాలి.' రైటేనా? రైటవునా కాదా? ఏటలా నాలికెళ్ళ బెట్టేసినావు? యెయ్ సూద్దాం ఆటికి జెయిలు! ఉఁ! యెయ్."

వీడికి పొగరెక్కువగా ఉంది అణిచేయాలి.

"నోరు ముయ్యి."

"దానికి జెయిలు సెప్పనేకపోతేం?! సెట్టేకాబట్టి నరికిపారించి."

వీడికి తల తిరుగుతోందా? మతి పోతాందా?

"నువ్వు నేరం చేసేవా రాస్కెల్?"

"రీజనింగు తీస్తే రాస్కెలంటాడు! సూడండి పెదరుబాబులంతా సూడండి. నాయెం యే యిదంగ వుందో సూడండి."

"షటప్! నేరం జేశావా లేదా?"

"సటప్ గిటప్ అనమోకా! సొక్కా ఏసుకోలేదన్చెప్పి అనువు జెయిస్సే పాస్‌పీసంటే నాను పణ్ను! నాను నీ కన్న ఎక్కువ బతుకే బతికినాను, 'సాల్టోళ్ళకి ఈ సేత్తో పాతికేలు కట్టుబడికట్టేవాణ్ని. అంత డబ్బు సూసుండవు. నెక్కెట్టేసరికి తెల్లారుద్ది! ఏటనుకొంటున్నావేటో!"

"నోర్ముయ్! ముందు నేరం సేసేవో లేదో చెప్తావా? చెప్పవా?"

"ఏటలా ఇరగబడి పోతున్నావు? నేరం జేసేవా అంటావా? ఆఁ సేసేను! ఏటయితే?"

"ఆర్నెల్లు."

"ఆర్నెల్లేటి?"

"జెయిలు"

"ఉస్! అంతేగద! ఆపాటిదానికి సెమటెక్కిపోద్దనుకున్నావా? భయంపడి గుండాగిపోద్దనుకున్నావా? ఆర్నెల్లు గాదు! రొండు సంవత్సరాలేసుకోవయ్యా, ఎయ్? రొండేళ్ళెయ్ సూద్దాం! యెయ్యేనేవు! నీకు యెయ్యడానికి రూల్సునేదు. ఫుల్ పవర్సేనేదు. నువ్వేటేసేవు? ఎ.... సే....వు!"

"షటప్! రాస్కెల్! వీణ్ని పైకి తీసుకుపోండి. క్విక్"

పట్టుకున్న వారికి రెండు చేతులూ ఇచ్చేసి, గుమ్మంవేపుకి ముందుకు నడుస్తూనే వెనక్కి తిరిగిచూస్తూ, బూతులుతిడుతూ వెళ్ళాడు ముసలాడు. వాడి నోట్లో ఎన్ని బూతులున్నాయి!

కాలాంతపు లంజికొడుకు!

చ! బూతుమాట.

ఈ సారాకేసుల్తో వీటివల్ల నాక్కూడా సహవాస దోషం....

చ! ఈ రాస్కెల్సంతా నన్ను పాడుచేస్తున్నారు. నాశనం చేస్తారు. నరకానికి పంపిస్తారు.

కాదు, అమాయకపు వెధవలకే జెయిళ్ళూ, నరకాలూను. ముసలాడు అమాయకుడా? వాడికి జెయిలుంది కాని, నాకు నరకంలేదు.

నరకం నరకం!!

నరకం ఎలా వుంటుంది?

చీకటిగా....

"తరవాత్తరవాత, వేగిరం పిలువు."

వరసగా రానీ!

ఆరువారాలు. నెల. మూడువారాలు. నాలుగు నెలలు. నేరం చేసేవా? అయిదు మాసాలు. పో. తాగేవా? డబ్బుకట్టుకుంటానంటావా? ఒద్దు జెయిలుకు ఫో! నాలుగువారాలు, కల్లు గీసెవుట, గీసేవా?

"ఈతచెట్టుకాదు, తాటి...."

తాటి చెట్టుకి జెయిలు చెప్పాలి.

ఈతచెట్టుకి ఫైను వెయ్యాలి.

ఎవడువాడు?

"తరవాద్ది పిలు?"

వేగిరం పిలు. జెయిలు చెప్పాలి. పట్టపగలే చెప్పాలి. ఐద్దాటితే తీసుకోరు. తల్లీ కొడుకూ రాజమండ్రి వెళ్ళాలి. 'ఎస్కార్ట్‌కి ఫోన్ చేసేరా? లేదూ? వేగిరం చెయ్యండ్రా రాస్కెల్స్!' రాస్కెలేకాదు, ఇంకా మాట అనగలను. ఆ పిల్లడు నేరం చేసేడా లేదా? చెయ్యలేదూ? అయితే చెప్పండి జెయిలు. నరకంలాగే జెయిల్లోకూడా. చీకటేనా? జైలూ నరకం తీసిపారీ! మన హాల్లో కావలసినంత చీకటి.

"తరవాత్తరవాత!"

ఏం కేసు?

సారావే!

నాకు మరింక మోక్షంలేదు.

"నేరం చేసేనంటావా? ఐతే వాటితోపాటు నీకూను."

"ఏమిటి బాబుగారూ?"

"నీకు తెలుసు."

వీడికి జెయిలు చెప్పేసేం!

మరింక తాటిచెట్టుకి జెయిలు చెప్పాలి.

ఈత చెట్టుకి ఫైను వెయ్యాలి.

నీ పెళ్ళాం ముండమొయ్యాలి.

నీ పిలక ఊడదియ్యాలి.

"ఏమైనా అన్నారా సార్?"

"తరవాత కేసు పిలు పిలు."

"కుంచాలమ్మా! కుంచాలమ్మా! కుం...."

"ఒస్తన్నా బాబూ!"

"నూకాలమ్మెకుర్రవా? కుంచాలమ్మెకుర్రవా?"

"కుంచాలమ్మెవరు!"

"నాను బాబు"

'నీకు నెల జెయిలు."

"ఇదేటి బాబూ?"

"నెల జెయిలు! మాటాడకు పో"

"తమరు దాన్నింక కొశ్చన్ చెయ్యలేదు సార్?"

"బెంచి గుమాస్తా వేనా నువ్వు!"

"అవును సార్"

"నీ కార్నెల్లు"

"ఏమిటి?!!"

"షటప్! ఆర్నెల్లేసేను పో! తరవాత! ఎవరక్కడ? ఇలారా! నీకు జెయిలు చెప్పాలిరారా! మూడువారాలుపో! వాణ్నిలా ఈడ్చుకురా! ఆ ప్లీడరూ, హెడ్డా మాటాడుతున్నా రిలా ఈడ్చూకురండి! అలా ఉండండి! నీకు జెయిలు నీకు జెయిలు. పొండి. మాటాడకండి. బంట్రోతేడి? ఒరే రమణా! నువ్వెళ్ళి తాటిచెట్టుని ఇలా ఈడ్చుకురా! కష్టడీలోకి తీసుకో. ఇది నా ఆర్డరు! వెళ్ళు! ఈతచెట్లన్నీ నరికిపారేయి. చీకటిపడేలోపున పనిపూర్తి చేసిరా. ఉండు, దీపం వెలిగించు, చీకటిగా వుంది. వెధవా! హాలంతా జెయిల్లా నరకంలా చీకటిగా ఉంచేవేం? చీకటిగదిలో చీమలేదుస్తున్నాయి. వెళ్ళి చూడ్రా బాబూ! చీమలు కాబోలు చూడ్రా చీమల్రా బాబూ! చలి చీమలు. పగపట్టిన పెనుచీమలు, తినేస్తాయి, ముక్క లెక్కలాగేస్తాయి. ఒస్తున్నాను. రావొద్దను. ఆపు ఆపాపు. రావొద్దు రావొద్దు ఒద్దు ఒద్దూ రాకండి బాబుల్లారా రాకండి రా కం...డి."

రెండు రోజుల తర్వాత మధ్యాహ్నం ఒంటిగంటకి ఊరవతల ఓ పెద్ద గేటుదగ్గిర ఓ కారు బర్రునవచ్చి ఆగింది. ఆగగానే దగ్గర పాకల్లో వున్న పాటకపు జనమంతా కారు చుట్టూ కండచీమల్లా మూగేరు. కార్లోంచి ఒక పోలీసు జవాను బైటకి దిగి, వారందర్నీ దూరంగా వెళ్ళిపొమ్మన్నాడు. వాళ్ళు రెండంగుళాలు వెనక్కి జరిగేరు.

కార్లోంచి "భూతాలు! చీమలు! నే రాను! కండలు తినేసి నన్ను చంపేస్తాయి. పగపట్టేయి. తినేస్తాయి. చంపేస్తాయి. అవిగో చీమల కొంపలు! నే రాను రాను" అని కేకలు వినిపిస్తున్నాయి. పది నిముషాలు పెనుగులాట జరిగింది, జనంలో "మేస్ట్రీటు మేస్ట్రీటు" అని గొడవ బయలుదేరింది. అతణ్ని ఇద్దరు లోనుంచి తోసి ఒకరు బైటనుంచి లాగ్గా ఎంతో పోట్లాడిన పిమ్మట చివరికి ముగ్గురు పోలీసులు పట్టుకోగా వెర్రిగా వాళ్ళ మధ్యని నిలబడ్డా డతను. జనాన్ని చూసి బెదిరేలోపున అతని కళ్ళు

ఎదురుగా వున్న గేటుమీద బోర్డుమీద పడ్డాయి. బోర్డుమీద అక్షరాలని పైకి బిగ్గరగా విడివిడిగా చదివేడతను.

"గర్నమెంటు, పిచ్చాసుపత్రి!! ఒహోహొహో! మర్చేపోయాను. గవర్నమెంటుకి, పాపం, పిచ్చెక్కిందె కదూ? ఎలా ఉందో ఏమిటో? పదండి చూద్దాం. అలా నిలబడి చూస్తారేమోయ్ జవాన్లు? పదండి చూద్దాం" అంటూ అతను గేటులోకి దారితీశాడు.

"గవర్నమెంటుకి పిచ్చెక్కడం కాదుకాని, మనం బతికేం" అనుకుంటూ అతని వెనక పోలీసు ఎస్కార్టు పార్టీ నడిచింది.

విశాలాంధ్ర దినపత్రిక. 14-5-1961